సాక్షి
తిరుపతి

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



సమయం లేదు మిత్రమా!

పదోతరగతి పరీక్షలకు సమయం సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని టీచర్లు సూచిస్తున్నారు. - 8లో



ఫ్లెక్సీ పోరు.. ప్రజల బేజారు

మంత్రి లోకేష్ పర్యటన సందర్భంగా టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు పలు ప్రాంతాల్లో ప్రమాదకరంగా ఉన్నాయి. - 8లో



కార్పొరేట్‌లకు కొమ్ముకాసే బడ్జెట్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్‌లకు కొమ్ముకాసేలా ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఆరోపించారు. - 8లో

న్యూస్‌రీల్

ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధికి కృషి



ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న మంత్రి సుభాష్

తిరుపతి తుడా : ఈఎస్‌ఐ ఆస్పత్రి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. బుధవారం తిరుపతి ఈఎస్‌ఐ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అవుట్ పేషెంట్ బ్లాక్, అత్యవసర విభాగం, ఓపీ, రిజిస్ట్రేషన్, ఇతర విభాగాలను పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అవుట్ పేషెంట్స్ 150 నుంచి 350 వరకు పెరగడం, ఇన్ పేషెంట్స్ 30 నుంచి 53 వరకు చేరడం సంతృప్తికరంగా ఉందన్నారు. ఈ క్రమంలోనే రూ.5 లక్షల తన సొంత నిధులు వెచ్చించి కిట్లు, వసతులు కల్పించిన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబును సత్కరించారు. రాష్ట్రంలోని ఇతర ఆస్పత్రుల సిబ్బంది తిరుపతి ఈఎస్‌ఐని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సూపరింటెండెంట్ శ్యాంబాబు, సీఎస్‌ఆర్‌ఎంఓ ప్రసాద్ పాల్గొన్నారు.

మార్చి 10లోపు డిగ్రీ సెమిస్టర్ ఫీజు చెల్లించాలి

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో డిగ్రీ 2, 4, 6వ సెమిస్టర్‌కు సంబంధించి ఫీజును మార్చి 10లోపు చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రూ.500 అపరాధ రుసుముతో మార్చి 17వరకు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు. అలాగే గురువారం నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ అందుబాటులో ఉంటుందని వివరించారు.ఈ మేరకు వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాల ప్రిన్సిపాళ్లకు సమాచారం అందించినట్లు తెలిపారు.

మహిళా సాధికారతే లక్ష్యం



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమ

తిరుపతి సిటీ : మహిళా సాధికారతే లక్ష్యంగా పద్మావతి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తామని వైస్ చాన్సలర్ వి.ఉమ తెలిపారు. బుధవారం ఈ మేరకు వీసీగా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. వర్సిటీతో 40 ఏళ్ల పాటు సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. ప్రతిష్టాత్మక విద్యాలయంలో నిపుణులు, సమర్థులైన అధ్యాపకులు ఉన్నారని వెల్లడించారు. బోధన, బోధనేతర సిబ్బంది సహకారంతో వర్సిటీని అంతర్జాతీయ స్థాయి తీసుకెళ్లేందుకు యత్నిస్తామని వివరించారు. అలాగే విద్యార్థి నులను నూతన పరిశోధనల దిశగా ప్రోత్సాహం అందిస్తామని, ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ఈ క్రమంలోనే అన్ని విభాగాల్లో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తామని వివరించారు. అనంతరం ఆమెకు రిజిస్ట్రార్ రజని, సిబ్బంది అభినందనలు తెలిపారు.

గడ్డు కాలం



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయం దండగలా మారింది. అన్నదాతలకు దిన దిన గండం నూరేళ్ల ఆయుష్షులా తయారైంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నాయి. నకిలీ ఎరువులు.. పురుగు మందులతో చీడపీడలు చుట్టుముట్టాయి. చివరకు ప్రాణంగా చూసుకునే భూమిని వదిలి వెళ్లే పరిస్థితులు తలెత్తాయి. ఇందుకు నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తున్నారు రైతు గంగిరెడ్డి దామోదరరెడ్డి. కోట మండలం దక్షిణపాళెం గ్రామానికి చెందిన దామోదరరెడ్డికి వాకాడు మండలం కాశీపురం సమీపంలో 3.5 ఎకరాల పొలం ఉంది. దాదాపు 30 ఏళ్లుగా సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అదేం చిత్రమో కానీ, 2015-19 మధ్య కాలంలో వరుసగా వ్యవసాయంలో నష్టాలు చవిచూశారు. సుమారు రూ.5లక్షల వరకు అప్పుల్లో కూరుకుపోయారు. అదే 2019-24 నడుమ ప్రకృతి కరుణించడంతో సమృద్ధిగా పంట దిగుబడి సాధించారు. అప్పుల బాధ నుంచి విముక్తులయ్యారు. ఇంతలో మళ్లీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. 8 నెలలుగా సంక్షేమ సాయం దూరమైంది. పాపం దామోదరరెడ్డిని వ్యవసాయం వెక్కిరించింది. . దీంతో ఆయన తనకు ఇష్టమైన సాగును వదిలి.. పాల వ్యాపారం దిశగా అడుగులు వేశారు. ఇంటింటికీ తిరిగి పాలు అమ్ముకుంటూ పొట్టపోసుకుంటున్నారు. – వాకాడు

అంతా మా ఇష్టం



ప్రకృతి వనరులను కూటమి నేతలు యథేచ్ఛగా దోచుకుంటున్నారు. ప్రజాప్రతినిధుల అండతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడ్డుపడిన అధికారులను బెదిరింపులకు గురి చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై దౌర్జన్యాలకు దిగుతున్నారు.ఈ క్రమంలోనే గూడూరు శివారులోని జగనన్న లేఅవుట్ దగ్గర ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టారు. దీనిపై సాక్షి పత్రికలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆ ప్రాంతంలోకి ఎవరూ ప్రవేశించకుండా ట్రెంచ్ ఏర్పాటు చేశారు. తదనంతరం వర్షాలు కురవడంతో గోతులు పూడిపోవడంతో కూటమి నేతలు మళ్లీ రంగంలోకి దిగారు. అక్రమంగా మట్టి తరలింపుకు శ్రీకారం చుట్టారు. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు వీఆర్ఓ బుధవారం ఘటనాస్థలానికి వెళ్లి మూడు ట్రాక్టర్లు, ఓ జేసీబీని స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో వెంటనే స్థానిక ప్రజాప్రతినిధి రంగంలోకి దిగారు. తమ అనుచరులకు చెందిన వాహనాలు సీజ్ చేయడంపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసుల నమోదుకు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుక యత్నించగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. – చిల్లకూరు

టీటీడీ పాలకమండలి సభ్యుడి అనుచిత వ్యాఖ్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీవారి సన్నిధిలో దుర్భాషలాడడంపై మండిపడుతున్నారు. భక్తుల సేవలో నిమగ్నమైన ఉద్యోగిని అవహేళన చేయడంపై ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు ఆందోళన తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తుంటే దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. ఉద్యోగిని అవమానించిన బోర్డు మెంబర్ నరేష్‌కుమార్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట నిరసనకు దిగనున్నట్లు స్పష్టం చేశారు.

అనుచితం.. అమానుషం



టీటీడీ ఉద్యోగిని దూషిస్తున్న బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ (ఫైల్)

టీటీడీ బోర్డు సభ్యుడి వ్యవహారశైలిపై ఉద్యోగుల ఆగ్రహం

- తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- నేడు పరిపాలన భవనం ఎదుట నిరసన

తిరుపతి కల్చరల్ : పవిత్రమైన తిరుమల శ్రీవారి సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బాలాజీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ తీరును వ్యతిరేకిస్తూ గురువారం నిరసనకు దిగనున్నట్లు టీటీడీ ఉద్యోగ సంఘాల నేతలు ప్రకటించారు. ఈమేరకు బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీటీడీ వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగ సంఘ నేతలు మాట్లాడారు. టీటీడీ బోర్డు ఆదేశాల మేరకు తిరుమలలో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. టీటీడీ నిబంధనలను మేరకు పనిచేస్తూ భక్తులకు నిరంతరం సేవలు అందిస్తున్నారని వెల్లడించారు. పవిత్రమైన టీటీడీ బోర్డులో స్థానం దక్కిన బోర్డు సభ్యులు సైతం నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు విరుద్ధంగా బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ కేవలం రెండు నిమిషాల్లో ఆలయ మహద్వారం ఎగ్జిట్ గేటును తీయలేదని ఓర్పును కోల్పోయి అసభ్యంగా మాట్లాడుతూ ఉద్యోగి బాలాజీని అవమానించడం దుర్మార్గమన్నారు. గత మూడు నెలలుగా ఇలాంటి ఘటనలు పునరావృత్తం కావడంతో ఉద్యోగులు బలవుతున్నారని వాపోయారు. భవిషత్తులో ఇలాంటి దుశ్చర్యలు జరగకుండా సమష్టిగా సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన టీటీడీ బోర్డు సభ్యుడిపై తక్షణ చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్‌తో నిరసన చేపడుతు న్నట్లు ప్రకటించారు. ఉద్యోగిపై టీటీడీ బోర్డు సభ్యు డు వ్యవహరించిన తీరును పలువురు విమర్శించారు.

కించపరచడం తగదు



నిరంతరం భక్తులకు సేవలందిస్తూ విధులు నిర్వహించే టీటీడీ ఉద్యోగి బాలాజీని టీటీడీ బోర్డు సభ్యుడు సహనానం కోల్పోయి కించపరచడం తగదు. అది ఆయన అజ్ఞానానికి నిదర్శనం. టీటీడీ ఉద్యోగులను అమానించే తీరుకు అందరూ స్వస్తి పలకాలి. ఇలాంటి వారిపై తక్షణ చర్యలు తీసుకొని ఉద్యోగుల్లో భద్రతా భావాన్ని పెంచేందుకు కృషి చేయాలి.

– వంకీపురం పవన్, కల్యాణ కట్ట నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు

వెంటనే సస్పెండ్ చేయాలి



రెండేళ్ల పాలు టీటీడీ బోర్డు సభ్యుడిగా భక్తులకు సేవ చేయడానికి బదులుగా ఉద్యోగులపై పెత్తనం చలాయిస్తూ దుర్మార్గంగా వ్యవహరించిన టీటీడీ బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్‌ను వెంటనే పదవి నుంచి సస్పెండ్ చేయాలి. గేట్లు తీసే సమయంలో జరిగిన ఆలస్యంతో ఉద్యోగిని అవమానించేలా దూషించడం దారుణం. ఆలయం బయటకు వెళ్లిపో అంటూ హుకుం జారీ చేయడం క్షక్షమించరాని నేరం. ప్రభుత్వం వెంటనే స్పందించి బోర్డు సభ్యుడిపై చర్యలు తీసుకోవాలి.

– ఆర్.హరికృష్ణ, సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి

క్షమాపణ చెప్పాలి



సనాతన ధర్మాన్ని పాటిస్తూ ఆధ్యాత్మిక చింతనతో వ్యవహరించాల్సిన టీటీడీ బోర్డు సభ్యుడు విధి నిర్వహణలో ఉన్న టీటీడీ ఉద్యోగి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత దారుణం. మహద్వారం గేటు తీయడంలో ఆలస్యం చేశారన్న నెపంతో నిగ్రహాన్ని కోల్పోయి అందరి ముందు బూతులు తిడుతూ హేళనం చేయడమేకాక ఆలయం వెలుపలకు వెళ్లిపో అని హెచ్చరిక చేయడం హేయమైన చర్య. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకొని ఉద్యోగుల మనోభావాలను పరిరక్షించాలి.

– పి.మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి

పవిత్రతను కాపాడాలి



టీటీడీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన బోర్డు సభ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి. తద్వారా భక్తుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాల్సిన అవసరం టీటీడీ యాజమాన్యం, ప్రభుత్వంపై ఉంది. అత్యున్నత స్థాయి పాలక మండలిలో సభ్యుడై ఉండి కనీస మర్యాద పాటించకుండా బూతులు మాట్లాడడం అత్యంత దుర్మార్గం. ఏళ్ల తరబడి భక్తుల సేవలో ఉన్న ఉద్యోగుల పట్ల సద్భావంతో వ్యవహరించి టీటీడీ పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఉంది.

– కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి.

దుర్భాషలు హేయం



రాత్రి, పగలు విధులు నిర్వహిస్తూ భక్తులకు సేవలు అందించే టీటీడీ ఉద్యోగులను అవహేళనంగా దుర్భాషలాడి అవమానించడం హేయం. మహద్వారం ఎగ్జిట్ గేటు తీయకూడదని టీటీడీ యాజమాన్యం ఆదేశాలు ఇచ్చింది. అధికారుల ఆదేశాలను పాటిస్తే తప్పుగా భావిస్తూ సహనం కోల్పోయి ఉద్యోగిని అందరి ముందు తిట్టడం సరికాదు. ఇలాంటి చర్యలను ఉద్యోగులు ఖండించకపోతే భవిషత్తులో వారిపై చులకన భావనం పెరిగే ప్రమాదం. ఉద్యోగిని తిట్టిన టీటీడీ బోర్డు సభ్యుడిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం సాగిస్తాం.

– హేమలత, టీటీడీ పద్మావతి మహిళా అసోసియేషన్ అధ్యక్షులు

దురుసు ప్రవర్తన దారుణం



టీటీడీ అధికారుల ఆదేశాల మేరకు తిరుమలలో ఉద్యోగులు పని చేస్తారు. ఇది విస్మరించి టీటీడీ ఉద్యోగి బాలాజీపై బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ దురుసు ప్రవర్తన దారుణం. దీన్ని టీటీడీ ఉద్యోగులందరం తీవ్ర స్థాయిలో ఖండిస్తున్నాం. ఆధ్యాత్మిక భావనతో వ్యవహరించాల్సిన టీటీడీ బోర్డు సభ్యుడు ఉద్యోగిని అనుచితంగా తిట్టడం సిగ్గుచేటు. గతంలో పనబాక లక్ష్మిని రెండు నిమిషాలు ఆపారనే కారణంతో ఒక ఉద్యోగిని సస్పెండ్ చేశారు. వీఐపీల తీరుతో ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఐక్యతతో ఎదుర్కొంటాం.

– వి.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

చర్యలు తీసుకోవాలి



టీటీడీ యాజమాన్యం ఆదేశాలను పాటించి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బాలాజీని అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్‌పై తక్షణం చర్యలు తీసుకోవాలి. ఆయన వ్యవహరించిన తీరు యావత్ టీటీడీ ఉద్యోగుల మనోభావాలను దెబ్బతీశాయి. తక్షణం టీటీడీ ఉద్యోగులకు బోర్డు సభ్యుడు బహిరంగ క్షమాపణ చెప్పాలి.

– కె.అంజినేయులు, టీటీడీ ఉద్యోగుల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు

మనోభావాలను దెబ్బతీశారు



గతంలో ఎన్నడూ లేని విధంగా విధి నిర్వహణలోనున్న టీటీడీ ఉద్యోగి బాలాజీపై బహిరంగంగా విక్షణా రహితంగా దుర్భాషలాడిన బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్ మా మనోభావాలను దెబ్బతీశారు. శ్రీవారి ఆలయ మహద్వారం వద్ద గేటు తీయలేదనే ఆగ్రహంతో బోర్డు సభ్యుడు ఉద్యోగిని అమానవించడం దుర్మార్గం. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చీర్ల కిరణ్, టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు

జన హితం.. మన అభిమతం

మేయర్ పదవిని లాక్కోవాలని చూస్తే సహించం

- పేదల సంక్షేమం కోసం జగనన్న.. ప్రజల ఓట్ల కోసం చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, వేదికపై ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : జన హితమే వైఎస్సార్‌సీపీ అభిమతమని, మాట తప్పని మడం తిప్పని నేతగా ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఎస్‌ఆర్ కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ నగర కమిటీ ప్రమాణస్వీకారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో కరుణాకరరెడ్డి మాట్లాడారు. జగనన్నను ఎన్నికల్లో పోగొట్టుకున్నామని రాష్ట్ర ప్రజలందరూ ఎంతో బాధపడుతున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అందించి దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేత జగనన్న మాత్రమేనని వెల్లడించారు. కూటమి నాయకుల అరాచకాలు మితిమీరిపోతున్నాయని, డిప్యూటీ మేయర్ ఎన్నికలో వారు చేసిన దుర్మార్గాలను ప్రజలు చూశారని తెలిపారు. అదే కుట్రధోరణితో మేయర్ పదవిని కూడా లాక్కోవాలని చూస్తే జగనన్ననే తిరుపతికి రప్పిస్తామని హెచ్చరించారు. తిరుమల వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ తొక్కిసలాటలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వచ్చినప్పుడు జగనన్న వెంట జనసంద్రమే తరలివచ్చిందని గుర్తుచేశారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మాట్లాడుతుండగానే జగనన్న కోసం జనం పరుగులు తీశారంటే ఏస్థాయిలో ఆదరణ ఉందో అర్థమవుతోందని చెప్పారు. విజయవాడలో వల్లభనేని వంశీని పరామర్శించేందుకు వచ్చిన జగనన్నను చూసేందుకు జనప్రవాహం తరలివచ్చిందన్నారు. ఈ పర్యాయం అధికారంలోకి రాగానే ప్రజలతో పాటు పార్టీ కార్యకర్తల సంక్షేమం దిశగా పాలన ఉంటుందని జగనన్న భరోసా ఇచ్చారని తెలిపారు. పేదలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న పాటుపడితే, ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకునేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తారని ఆరోపించారు. గత ఎన్నికల్లో జగన్ సంక్షేమ పథకాల ద్వారా రూ. 2.5లక్షల కోట్లు వస్తే తాను మరో రూ. 2.5లక్షల కోట్లు కలిపి సంక్షేమ పథకాలు అందిస్తానని చంద్రబాబు చెప్పిన హామీలు ఏమైయ్యాయని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఒక్క హామీని నెరవేర్చని ప్రజాద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. గత ఎన్నికల్లో అభినయ్ ఓడిపోయినప్పుడు కూడా బాధపడలేదని, ఎంతో ఇష్టపడే వ్యక్తులు పదవుల కోసం వదిలి వెళ్లిపోయినప్పుడే ఎక్కువ బాధపడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రి చేసుకునేవరకు సైనికుల్లా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ప్రభుత్వానికి నిద్రలేని రాత్రులే

ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భూమన కరుణాకరరెడ్డి నాయకత్వంలో అవిశ్రాంత పోరాటం చేద్దామని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు. సర్కారుకు ఇకపై నిద్రలేని రాత్రులే ఉంటాయని వెల్లడించారు. ఆధ్యాత్మిక నగరంలో ఎప్పుడూ చూడని అమానవీయ ఘటనలను డిప్యూటీ మేయర్ ఎన్నికలో చూశామన్నారు. రౌడీలతో పోలీసులు కలిసిపోయి ప్రజాస్వామ్యంపై దాడి చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులపై దాడికి పాల్పడిన వారిని కటకటాలపాలు చేసే వరకూ పోరాటం కొనసాగిస్తామని వెల్లడించారు. నగర కమిటీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు.

ప్రజలే బుద్ధి చెబుతారు

అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. జగనన్న పాలనలో ఈ నెల ఏ పథకం వస్తుందని ప్రజలంతా చర్చించుకుని సంతోషంగా పొందేవారన్నారు. అయితే కూటమి పాలనలో ఈ రోజు ఎవరిని అరెస్ట్ చేస్తారు, ఎవరిని బెదిరిస్తారు, ఎవరి ఆస్తులను ధ్వంసం చేస్తారనే ప్రజల్లో చర్చ జరుగుతోందని వెల్లడించారు.

అపహాస్యం చేసింది

ప్రజాప్రతినిధులుగా తాము ఓటు హక్కు వినియోగించుకోవడానికి వెళుతున్న తమ బస్సుపై దాడి చేసి ప్రజాస్వామ్యాన్ని కూటమి ప్రభుత్వం అపహాస్యం చేసిందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయకుండా వైఎస్సార్‌సీపీ నాయకులే టార్గెట్‌గా కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రజాసంక్షేమం కోసం శ్రమించే జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ప్రజలంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 68,427 మంది స్వామివారిని దర్శించుకోగా 21,066 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.81 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

రేపటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 14రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకలకు 21న భక్తకన్నప్ప ధ్వజారోహణంతో అంకురార్పణ జరగనుంది. 22న స్వామివారి ధ్వజారోహణం, 26న మహాశివరాత్రి, రాత్రి నందిసేవ, 27న ఉదయం రథోత్సవం, రాత్రి నారద పుష్కరిణితో తెప్పోత్సవం, 28న శివపార్వతుల కల్యాణం, మార్చి 2న గిరిప్రదక్షిణ, 4న పల్లకీ సేవ, 5న ఏకాంతసేవ, 6న శాంతి అభిషేకాలతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం కానున్నాయి.

క్లుప్తంగా

చికిత్సపొందుతూ వృద్ధుడి దుర్మరణం


రామచంద్రన్(ఫైల్)

నాగలాపురం : మండలంలోని వినోభానగర్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు తిరువళ్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. నాగలాపురం తూర్పు హరిజనవాడకు చెందిన ఎంజీ రామచంద్రన్ (68) మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు హెడ్ కానిస్టేబుల్ హనీఫ్ తెలిపారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి


వెంకటేష్ (ఫైల్)

నాగలాపురం:మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఈ నెల 14వ తేదీన ఆత్మహత్యకు యత్నించిన వెంకటేష్ (28) చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం చేయించి కుటుంబీకులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కోలుకుంటున్న శిశువు

తిరుపతి తుడా: పలమనేరు మండల పరిధిలోని బాలిక నవజాతి శిశువుకు జన్మనిచ్చి మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆ శిశువుకు తిరుపతి రుయా ఆసుపత్రి చిన్నపిల్లల విభాగంలోని ఎన్ఐసీయూలో వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. తొలి రెండు రోజులు చిన్నారి ఆరోగ్యం కుదుటపడడం కష్టతరంగా ఉందని వైద్యులు భావించారు. నెలలు నిండకనే జన్మించడం, బరువు తక్కువగా ఉండడం వంటి కారణాలను గుర్తించారు. ప్రస్తుతం ఆరోగ్యం కొంత కుదుటపడుతోందని తెలిపారు.వెంటిలేటర్ సహాయాన్ని తొలగించి సీటాప్ మిషన్‌పై వైద్యం అందిస్తున్నారు.

సమయం లేదు మిత్రమా!

- పది పరీక్షలకు సన్నద్ధం
- వచ్చే 25 రోజులు చాలా కీలకం
- ముఖ్యమైన అంశాలపై పట్టు అవసరం



తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇక 24 రోజులు మాత్రమే సమయం ఉంది. పరీక్షలను ఎలా రాయాలి, మంచి మార్కులు సాధించేందుకు ఎలాంటి ప్రణాళికలు వేసుకోవాలి, ఏయే పాఠ్యాంశాలను రివిజన్ చేసుకోవాలి..? వంటి అంశాలపై ఆయా సబ్జెక్టు టీచర్ల సలహాలు, సూచనలను తీసుకోవాంటున్నారు నిపుణులు. ముఖ్యమైన అంశాలపై పట్టు బిగిస్తే పది పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణం సాధించవచ్చని సబ్జెక్టు నిపుణులు చెబుతున్నారు. అలాగే తెలుగులో దోషాలుండొద్దు.. హిందీలో 'నిబంధ్'పై పట్టుండాలి.. ఆంగ్లంలో ఎడిటింగ్ ముఖ్యం, 'జీవన' చిత్రాలపై తర్ఫీదు అవసరం, తికమక పడొద్దు'.. సూత్రాల 'లెక్క' తప్పొదు.. చరిత్ర తెలుసుకోవాలి.. అంటున్నారు ఆయా సబ్జెక్టు టీచర్లు.

సాంఘిక శాస్త్రం



1. మ్యాప్, టేబుళ్లు, గ్రాఫ్స్‌ను తర్ఫీదు చేయాలి.
2. ప్రపంచ పటంలో యూరోప్ ఖండానికి సంబంధించిన దేశాలు.. వాటి పేర్లు, దేశ చిత్రపటాలు, భారతదేశ పటంలో ఉన్న ముఖ్య నగరాలు, పీఠభూములు, నదులు, ఖనిజాలు ఉన్న ప్రాంతాల పేర్లు బాగా గుర్తు పెట్టుకోవాలి.
3. పేరాగ్రాఫ్ అంశంలో ఒక ప్రదేశానికి సంబంధించి ప్రశ్న ఇస్తారు.
4. పర్యావరణం, కాలుష్య నియంత్రణ, మ్యాప్స్, గ్రాఫ్స్, బార్ డయాగ్రామ్స్‌పై పట్టు సాధించాలి. - ఎ.శంకర్‌రెడ్డి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు

భౌతిక శాస్త్రం



1. వ్యాసరూప ప్రశ్నలపై ఎక్కువ దృష్టి సారిస్తే ఉత్తమ మార్కులు సాధించవచ్చు. పటాలు గీయడం సాధన చేయాలి.
2.రంగుల ప్రపంచం, విద్యుత్తు, రసాయన చర్యలు, సమీకరణాలు, కార్బన్- వాటి సమ్మేళనాలు, విద్యుత్ ప్రవాహం.. అయస్కాంత ప్రభావాలు, లోహాలు, అలోహాలు అంశాల్లో నుంచి వ్యాసరూపాలను బాగా చదువుకోవాలి.
3. కాంతి-పరావర్తనం, వక్రీభవనం, ఆమ్లా - క్షారాలు, లవణాలు వంటి అంశాలపై పట్టు పెంచుకోవాలి.

- ఎన్.సౌజన్య, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయిని, జెడ్పీ హైస్కూల్, పిచ్చాటూరు

జీవశాస్త్రం



1.ప్రతి పాఠ్యాంశంలో ఉన్న ప్రయోగాలు, టేబుల్స్, ఫ్లోచార్ట్స్‌పై పట్టుండాలి. పటాలు గీయడం బాగా నేర్చుకోవాలి.
2. పర్యావరణానికి సంబంధించిన అంశాలను బాగా చదవాలి. స్లోగన్స్‌ను బాగా ప్రాక్టీసు చేయాలి.
3. టెన్ ఫామ్స్ కింద వైద్యులు - అవయవాల గురించి విశ్లేషణలను చదవాలి.
4. లైఫ్ ప్రాసెస్, కంట్రోల్ అండ్ కోఆర్డినేషన్ తదితర అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలొస్తాయి.

- టీ.రాజశేఖర్‌రెడ్డి, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు

తెలుగు



1. తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 20 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్య భాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం అంశాలు, చందస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలొస్తాయి.
2. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు, త్రిజట అంశాలతో పాటు రామాయణం, ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం, వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

- డాక్టర్ సి.కుప్పయ్య, తెలుగు ఉపాధ్యాయుడు

ఇంగ్లిష్



1. ఎడిటింగ్, ప్యాసేజ్ అంశాలపై పట్టు సాధించాలి.
2. యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, రిపోర్టెట్ స్పీచ్ అంశాలను చదవాలి.
3. ఒకాబులరీ గ్రామర్‌కు టెక్స్ టూల్‌ను ఎక్కువగా సాధన చేయాలి.
4. రెయిమ్స్, స్కీమ్, ఫొనెటిక్స్‌ను చదివితే సులువుగా ప్రశ్నలకు జవాబులు రాయవచ్చు.

-డీ.జగదీష్ ప్రసాద్, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు

హిందీ



1. నిబంద్ అంశంలోని పాఠ్యాంశాలు, సామాజిక అంశాలు, పర్యావరణ, తక్నీతి అంశాలకు సంబంధించిన వాటిపై పట్టు సాధించాలి.
2. వ్యాకరణాంశాల్లో ఉపసర్గ్, క్రియ, సంఖ్య, తత్సమ్-తద్భవ్, ప్రత్యయ్, సంధి అంశాలు, గద్యాంశంలో డైరీ ఏక్ పన్నా పాఠం, తతారా వామీరో పాఠ్యాంశాలను అభ్యసనం చేయాలి.
3. పద్య భాగం నుంచి మనుష్యత, తోప్, కవి పరిచయాల్లో మీరా బాయి, కబీర్‌దాస్ అంశాలపై పట్టు అవసరం. - రేగంటి దేవానంద్, హిందీ ఉపాధ్యాయుడు

గణితం



1, ప్రతి పాఠంలోని సూత్రాలపై పట్టు సాధిస్తే పరీక్షలో వచ్చే ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయొచ్చు. 1, 2, 3, 13, 14 పాఠ్యాంశాలు, 10, 11, 12 పాఠ్యాంశాల్లో ఉన్న ప్రశ్నలు వస్తాయి.
2. బహుపదులు, వృత్తాలు, త్రికోణమితీయ అనువర్తనాలు, ఉపరితల వైశాల్యాల్లో పటాలు గీయడంపై ప్రాక్టీసు చేయాలి.
3. త్రికోణమితీయ పట్టికలు, సర్వసమీకరణల ఉపరితల వైశాల్యాల పట్టికలపై సాధన అవసరం.

-ఎ.దామోదర్‌నాయుడు, గణిత ఉపాధ్యాయుడు

నేర నియంత్రణే లక్ష్యం

తిరుపతి క్రైమ్ : జిల్లాలో నేర నియంత్రణే లక్ష్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు నిర్వహించినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ స్పెషల్ పార్టీ పోలీసులు నిత్యం గస్తీ చేపట్టి రాత్రివేళ అనుమానాస్పదంగా సంచరిస్తున్న 706 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. వారికి ఆయా పోలీస్‌స్టేషన్లలో కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు వివరించారు. అలాగే 148 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 2,378 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నిందితులకు కోర్టు జరిమానా విధించిందని వెల్లడించారు. ఈ క్రమంలోనే 372 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. రోడ్లకు ఇరువైపులా ఆక్రమించి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న 1,597 మంది చిరువ్యాపారులపై న్యూసెన్స్ యాక్ట్ కింద కేసులు కట్టినట్లు వివరించారు.

'అన్వేషణ'కు ఎస్వీయూ బృందం


విద్యార్థినులను అభినందిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : బెంగళూరులోని రామయ్య వర్సిటీలో గురువారం నుంచి రెండు రోజుల పాటు అన్వేషణ-25 పేరుతో నిర్వహించనున్న 'శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల అంతర్జాతీయ విద్యార్థుల పోటీలకు ఎస్వీయూ బృందం హాజరుకానుంది. వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో సంజయ్ కుమార్, భవ్య శ్రీ, దీప్తి, జాస్మిన్‌లతో కూడినబృందం బుధవారం బెంగళూరుకు పయనమైంది. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ బృందానికి అభినందనలు తెలిపారు. పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ హరికృష్ణ, అధ్యాపకులు కుసుమ, శరత్ బాబు పాల్గొన్నారు.

ముగిసిన 'మహాకుంభ్'


మంత్రులు లోకేష్, సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి అర్బన్ : అంతర్జాతీయ ఆలయాల అనుసంధానమే లక్ష్యంగా తిరుపతిలో నిర్వహిస్తున్న మహాకుంభ్-2025 సదస్సు బుధవారంతో ముగిసింది. ఇంటర్నేషనల్ టెంపుల్ ఫెడరేషన్ చైర్మన్, మహారాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక రాజధానిలో సదస్సు నిర్వహించడం దేవుని ఆశీస్సులుగా భావిస్తున్నట్లు తెలిపారు. అగ్రశ్రేణి మత పెద్దలు, విధాన నిర్ణేతలు, ఆలయ నిర్వాహకుల సమక్షంలో చారిత్రాత్మక అడుగు వేసినట్లు వెల్లడించారు. ఈ సదస్సు ఆలయ పరిపాలన, మతపరమైన పర్యాటకం మరియు ఆధ్యాత్మిక వారసత్వ పరిరక్షణకు ప్రత్యేకించి టెంపుల్ కనెక్ట్‌కు దోహదపడుతుందని చెప్పారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ మట్లాడుతూ రాజ్యాంగం ద్వారా కల్పించిన మతపరమైన స్వేచ్ఛలను వివరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ శక్తివంతమైన ఆలోచన, భాగస్వామ్యంతో సదస్సు చేపట్టారని తెలిపారు. దేవాలయాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్లోబల్ సమ్మేళనాన్ని తిరుపతిలో నిర్వహించడం సంతోషంగా ఉందని వెల్లడించారు. అనంతరం టెంపుల్ కనెక్ట్ అండ్ ఐటీసీ ఎక్స్‌పో వ్యవస్థాపకుడు గిరీష్ కులకర్ణి, చైర్మన్ నీతలను,దేవికూప్ మహాభద్రకాళి శక్తిపీఠం అధ్యక్షుడు సత్పాల్ శర్మాజీ, గురూజీ ప్రతిష్టాత్మక చండీ ముకుట్‌ను సత్కరించారు. కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీరెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


అనర్జిత్ మృత దేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చిన్నగోవిందు

తిరుపతి రూరల్ : మండలంలోని వెంకటపతి నగర్‌లో మంగళవారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మహారాజ్ గంజ్ జిల్లా, భరత్ గద్ద గ్రామానికి చెందిన అనర్జిత్ (28) గత 8 ఏళ్లుగా పెయింటింగ్ పనిచేసి జీవనం సాగించేవాడు. అతడికి ఇద్దరు భార్యలు, మొదటి భార్యకు ఒక కొడుకు. రెండో భార్య సోనాలికి రెండు నెలల కుమారుడు వున్నాడు. మొదటి భార్య యూపీలో ఉంది. రెండో భార్యతోకిసి అనర్జిత్ వెంకటపతి నగర్‌లోని అద్దె ఇంటిలో కాపురముంటున్నారు. మద్యానికి బానిసైన అనర్జిత్ తన రెండో భార్య సోనాలితో తరచుగా గొడవపడేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి ఇంటి లోపల గడియ పెట్టుకున్నాడు. బుధవారం ఉదయం భర్త తలుపు తెరకపోవడంతో అనుమానం వచ్చిన సోనాలి తలుపు సందులో నుంచి చూడగా అనర్జిత్ ఫ్యానుకు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. రూరల్ సీఐ చిన్నగోవిందు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడి తమ్ముడు రహ్మిట్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక భరోసా అవసరం


డైరీ ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

తిరుపతి కల్చరల్ : ఉద్యోగులకు ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా నిరంతరం ప్రజలకు సేవలు అందించే ఉద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షలకు పైగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు అందించాల్సి ఆర్థిక ప్రయోజనాలకు ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల సర్వీస్ రూల్స్ వ్యవహారాల నియంత్రణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వేతన సవరణ కోసం హైకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో త్రిసభ్య కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులపై ఒక ప్రణాళికతో ప్రకటన విడుదల చేయాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు లక్ష్మీపతి, జిల్లా అధ్యక్షుడు తులసీరామ్, కార్యదర్శి సుబ్బరాయుడు, కోశాధికారి ఎం.మధుబాబు పాల్గొన్నారు.

వీణాపాణి విహారం


హంస వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీనివాసుడు


చిన్నశేషవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- అంగరంగ వైభవంగా కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు
- చిన్నశేషవాహనంపై ఊరేగిన వేణుగోపాలకృష్ణుడు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం ఉదయం స్వామి వారు వేణుగోపాల కృష్ణుడి అవతారంలో అయిదు తలల చిన్న శేషుడిపై ఆశీనులై నాలుగు మాఢవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజన జరిపించారు. సాయంత్రం వైభవంగా ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామి వారు వీణ ధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులై తిరుమాడవీధుల్లో విహరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ఆవరణలో టీటీడీ అధికారులు హిందూ ధర్మప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో చేపట్టిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్ పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి


రాజయ్య(ఫైల్)

చిట్టమూరు : మండలంలోని చిల్లమూరుకు చెందిన రాజయ్య (47) అనే వ్యక్తి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చిన్నబలరామయ్య బుధవారం తెలిపారు. మంగళవారం చిల్లమూరు క్రాస్ రోడ్డు వద్ద రెండు మోటర్ సైకిళ్లు ఢీ కొనడంతో షేక్ మస్తాన్ అనే వ్యక్తి అక్కడికక్కడే మరణించగా, సుబ్రమణ్యం, రాజయ్య తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో రాజయ్య మృతి చెందగా పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు మతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం కృష్ణాపురంలో జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి ముగ్గురు నిందితులకు రెండేళ్ల చొప్పున జైలు శిక్ష విధిస్తూ బుధవారం తిరుపతి అడిషినల్ అసిస్టెంట్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పిందని సీఐ శరత్‌చంద్ర తెలిపారు. అలాగే రూ.2,500 చొప్పున జరిమానా విధించిందని వెల్లడించారు.

కార్పొరేట్‌లకు కొమ్ముకాసే బడ్జెట్

తిరుపతి కల్చరల్ : ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, కార్పొరేట్‌లకు కొమ్ముకాసే బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. బుధవారం తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేంద్ర బడ్జెట్‌పై నిరసన తెలిపారు. రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలను దగా చేస్తున్న మోదీ ప్రభుతానికి ఐక్య ఉద్యమాలతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.రైతులకు కనీస మద్దతు ధర కల్పించకపోవడం అత్యంత దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థలని ప్రైవేట్ పరం చేసి దేశాన్ని దివాలా చేసే పనిలో మోదీ ప్రభుత్వం ఉందని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను దేశ ప్రజలు, వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని వెల్లడించారు. 2014లో ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ తన పార్టీ అజెండా పక్కనపెట్టి బీజేపీ అజెండా నెత్తిన పెట్టుకొని సనాతన వాదంతో తిరుగుతున్నారని మండిపడ్డారు. సీపీఐ నేతలు మురళి, చిన్నంపెంచలయ్య, రామానాయుడు, సీపీఎం నేతలు నాగరాజు, సుబ్రమణ్యం, జయంద్ర, సాయిలక్ష్మి, సీపీఐ ఎంఎల్ నేతలు హరికృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు.

వినూత్న నిరసన



ఎస్వీ వెటర్నరీ వైద్య విద్యార్థులు బుధవారం వినూత్నంగా నిరసన తెలిపారు. గౌరవ వేతనం పెంపు కోసం 17 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని మండిపడ్డారు. ఈ మేరకు వర్సిటీ మైదానంలో హైక్ స్టయిఫండ్ సింబల్ రూపంలో బైఠాయించారు. అనంతరం తిరుపతికి విచ్చేసిన కేంద్ర కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి చంద్రశేఖర్‌ను ఓ ప్రైవేట్ హోటల్‌లో కలిసి వినతి పత్రం అందించారు. - తిరుపతి సిటీ

ఫ్లెక్సీ పోరు.. ప్రజల బేజారు





తిరుపతిలో మంత్రి నారా లోకేష్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు పెద్ద సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే ఒకరు పెట్టిన ఫ్లెక్సీలను మరొకరు తొలగించి తమ ఆధిపత్యం చాటుకునేందుకు యత్నించారు. గరుడ వారధి, నంది కూడలి తదితర ప్రాంతాల్లో పలు ఫ్లెక్సీలను రోడ్లపై విచ్చలవిడిగా పడేశారు. దీంతో పలువురు వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదానికి గురయ్యేవారమని నగరవాసులు మండిపడ్డారు.ఈ క్రమంలోనే కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఆర్చిలకు సైతం అడ్డుగా ఫ్లెక్సీలు పెట్టడంపై ఆవేదన వ్యక్తం చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి